క్లుప్తంగా

మొక్కజొన్న సాగుకు శ్రీకారం



మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న మహిళలు

దొర్నిపాడు: వారం రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలకు రైతులకు ఖరీఫ్‌లో భాగంగా మొక్కజొన్న పంట సాగుకు శ్రీకారం చుట్టారు. గురువారం మంచి రోజు కావడంతో క్రిష్టిపాడు, దొర్నిపాడు, గుండుపాపల తదితర గ్రామాల్లో రైతులు కూలీలతో విత్తనాలు నాటించారు. ప్రస్తుతం మొక్కజొన్న క్వింటా ధర రూ.2వేలకు పైగా ఉండటంతో రైతులు పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

దొర్నిపాడు: బాలలకు చదువే బంగారు భవిష్యత్‌ను ఇస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ తెలిపారు. గురువారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె అంగన్‌వాడీ కేంద్రం -1లో 11-18 సంవత్సరాల బాలబాలికలకు బాల సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని రకాలుగా వసతులు కల్పిస్తుందని, బాగా చదువుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరం అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త తులశమ్మ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



చాగలమర్రి రిక్వెస్ట్ స్టాప్‌లో మృతి చెందిన రాముడు

చాగలమర్రి: మండల కేంద్రంలో కొన్నేళ్లుగా రాముడు (65) అనే వ్యక్తి స్థానిక హోటళ్లలో పనిచేస్తూ జీవనం గడిపేవాడు. కొన్ని నెలలుగా అనారోగ్యానికి గురై రిక్వెస్ట్ స్టాప్‌లో తలదాచుకుంటూ, పరిచయం ఉన్న వారి నుంచి ఆర్థిక సహాయం అర్థిస్తుండేవాడు. పరిస్థితి విషమించి బుధవారం అర్ధరాత్రి అక్కడే మృతి చెందాడు. వార్డు సభ్యుడు మాబుసున్న, పారిశుద్ధ్య కార్మికుడు ప్రకాశ్ విషయాన్ని తెలుసుకొని పారిశుద్ధ్య సిబ్బంది సహాయంతో అనాథ అయిన రాముడు మృత దేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

పొదుపు నిర్వహణపై ఆడిట్



ఉయ్యాలవాడలో అడిట్ నిర్వహిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ : స్థానిక క్రాంతి పథం కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పొదుపు గ్రూపు సభ్యుల లావాదేవీల నిర్వహణపై ధన్విత్‌ఖాన్ ఆధ్వర్యంలో గురువారం ఆడిట్ నిర్వహించారు. మండల ఐక్య, గ్రామైక్య సంఘాలు ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు, స్త్రీనిధి లావాదేవీలు, గ్రామ వీఓఏల పనితీరుపై క్షేత్రస్థాయిలో రికార్డుల నిర్వహణ, తదితర అంశాలపై ఆడిట్ చేపట్టారు. పూర్తి నివేదికలను సిద్ధం చేసి లోపాలు వెల్లడైతే వాటిని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం దాస్, సీసీలు గంగన్న, నాగన్న పాల్గొన్నారు.

అలరించిన భజన కార్యక్రమం



భజన కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నంద్యాలకు చెందిన సీతారామాంజనేయస్వామి భజన మండలి వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో వినాయకస్తుతి, లింగాష్టకం, శ్రీశైలవాసా శ్రీమల్లికార్జున, శైలం శివమయం, కరుణించరా శంకరా, శివశివశంకరా, శంభో శంభో తదితర భక్తిగీతాలు, అష్టకాలను మండ్ల రాము, దివాకర్ రెడ్డి, వెంకటరమణ, బాబు, వెంకటస్వామి, పాపయ్య, మద్దయ్య, పవన్, శేఖర్, పుల్లయ్య, మధు, హరి, జనార్దన్‌రెడ్డి, మహేష్, వెంకటరమణ, శేఖర్ నాయుడు, కార్తిక్, మద్దిలేటి తదితరులు ఆలపించారు.



పాఠశాలలకు పుస్తకాలను తీసుకెళ్తున్న టీచర్లు



క్రిష్ణాపురంలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



రుద్రవరం మోడల్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

బడి గంట మోగింది

- పాఠశాలలు పునఃప్రారంభం
- విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ
- నూతన అడ్మిషన్లకు హెచ్‌ఎంలను సంప్రదిస్తున్న తల్లిదండ్రులు

ఆళ్లగడ్డ: నాటి పాడు'బడి'న గోడలకు కాలం చెల్లింది. పెచ్చులూడి పడే పైకప్పుల శకం ముగిసింది. ఆరుబయట.. చెట్ల కింద అనే మాటేలేదు. తళతళలాడే గదులు.. మిరుమిట్లు గొలిపే హంగులు.. కార్పొరేట్ ను తలదన్నే సొబగులతో చరిత్రలో నిలిచిపోయేలా మనబడి నాడు - నేడుతో సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతవరణాన్ని తలపించేలా పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే మొహం చాటేసే తల్లిదండ్రులు.. నేడు అడ్మిషన్ల కోసం పరుగులు తీస్తున్నారు. రెండు నెలల వేసవి సెలవుల అనంతరం గురువారం పండుగ వాతవరణంతో పునఃప్రారంభమయ్యాయి. తొలి రోజునుంచే అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు చిన్నారులతో వచ్చి పాఠశాల ఆవరణలో కూర్చున్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

వేసవి సెలవులు అనంతరం బడి గంట గణగణమంటు మోగగా విద్యార్థులు ఉదయమే యూనిఫాం వేసుకుని ముస్తాబై నూతనోత్సాహంతో కేరింతలు కొడుతూ పాఠశాలలకు పరుగులు తీశారు. దాదాపు రెండు నెలలుగా మూగబోయిన పాఠశాలలు విద్యార్థుల రాకతో సందడి నెలకొంది. పాత తరగతి వదిలి కొత్త తరగతిలోకి వచ్చామనే సంతోషంతో విద్యార్థులు సంతోషంగా గడిపారు.



క్రిష్ణాపురంలో పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

వైభవంగా 'స్వాగత సంబరం'

'స్వాగత సంబరం' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయమే ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాలలను శుభ్రపరిచి, ప్రాంగణమంతా కళ్లాపు చల్లించి, ముగ్గులు పెట్టించారు. ఎంఈఓలు, సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామ పెద్దలతో కలిసి మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు కట్టి పాఠశాలలను అలంరించారు. ప్రార్థనలు నిర్వహించి జాతీయ గీతాన్ని ఆలపించిన అనంతరం తరగతులను ప్రారంభిచారు.

శిరివెళ్ల: వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. మండలంలోని విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి టీచర్లు తమ తమ పాఠశాలలకు తీసుకెళ్లారు. 43 పాఠశాలలో నూతన అడ్మిషన్లు మొదలయ్యాయి. అలాగే పదవ తరగతి పాసైన విద్యార్థులు టీసీల కోసం పాఠశాలలకు వచ్చారు. ఎంఈఓ శంకర్ ప్రసాదు మాట్లాడుతు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను అందజేస్తామని తెలిపారు. యూనిఫాం ఇంకా మంజూరు కాలేదు. బెల్టులు మాత్రమే అందాయి.

దొర్నిపాడు: యాభైరోజుల వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది. నూతన ప్రవేశాల కోసం తల్లిదండ్రులు హెచ్‌ఎంలను సంప్రదించి బడుల్లో చేర్పిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరవేశారు.

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని 56 ప్రభుత్వ పాఠశాలల తలుపులు గురువారం తెరుచుకున్నాయి. బడులు తెరుచుకోగానే విద్యార్థులు బడి బాట పట్టారు. దారి వెంట స్నేహితులతో పిచ్చాపాటి మాట్లాడుకుంటు బడులకు చేరుకున్నారు. మొదటి రోజు కావడంతో విద్యార్థుల హాజరు తక్కువగా కనిపించింది.వచ్చిన విద్యార్థులకు పలు పాఠశాలల్లో పుస్తకాలను పంపిణీ చేశారు. ఇందులో భాగంగానే రుద్రవరం మజరా తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.



క్రిష్టిపాడు ఎంపీయూపీ స్కూల్‌లో బడిగంట మోగిస్తున్న ఆయా

అన్ని ఏర్పాట్లు చేశాం

పాఠశాలలో చేరిన మొదటి రోజే విద్యార్థికి అవసరమై వస్తువులు అందజేస్తున్నాం. ప్రతి విద్యార్థికి విద్యా దీవెన కిట్లు అందజేస్తాం. అందరికీ సరిపడా కిట్లను ప్రభుత్వ సరఫరా చేసింది. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేయని విద్యార్థులకు కూడా (క్యారియర్ తెచ్చుకున్న) గుడ్డు, చెక్కి అందజేస్తాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.

– శోభావివేకవతి,ఎంఈఓ

మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థులు..

మండలం	హైస్కూళ్లు	కేజీబీవీ	మోడల్	యూపీ	ప్రాథమిక	విద్యార్థులు
ఆళ్లగడ్డ	11	1	1	08	49	14,848
శిరివెళ్ల	6	1	1	11	27	8,200
దొర్నిపాడు	3	1	0	3	23	5,295
ఉయ్యాలవాడ	5	1	1	9	19	6,236
చాగలమర్రి	9	1	0	8	43	8,457
రుద్రవరం	7	1	1	8	49	7,975



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ రామచంద్రయ్య



చింతకొమ్మదిన్నెలో చిన్నారులను బడికి తీసుకొస్తున్న తల్లి



చింతకొమ్మదిన్నెలో బడి గంట మోగిస్తున్న దృశ్యం



నూతన అడ్మిషన్లు తీసుకుంటున్న హెచ్‌ఎం



క్రిష్టిపాడులో బడిలో వదిలేందుకు ఇద్దరు పిల్లలను తీసుకెళ్తున్న తండ్రి



అయ్యలూరు జెడ్పీహెచ్ విద్యార్థులతో ఉపాధ్యాయులు



కొత్తపల్లెలో తరగతి గదిలో విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

నంద్యాల(అర్బన్) : మండలంలోని గ్రామాల్లో గురువారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు ఉల్లాసంగా, ఉత్సాహంగా హాజరయ్యారు. బడిగంట మోగకముందే విద్యార్థులు బడికి చేరుకొని ఒకరినొకరు పలకరించుకున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు ఎక్కువ శాతం హాజరు కావడం పట్ల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

18నుంచి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

నంద్యాల(న్యూటౌన్): 2024-25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి అడ్మిషన్లు ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు అడ్మిషన్లు పొందాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 8 సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్‌లో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. బీఏ, ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ మేథమేటిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆయా కోర్సులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును మాత్రమే వసూలు చేస్తామన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్స్, ల్యాబ్స్, లైబ్రరీ, నూతన కంప్యూటర్ ల్యాబ్ తదితర సౌకర్యాలన్నీ కళాశాలలో ఉన్నాయని చెప్పారు. అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ స్కాలర్ షిప్‌లు అందజేస్తామన్నారు. కాలేజీలో చేరే విద్యార్థులు రెండు ఫొటోలు, ఆధార్ కార్డు, ఇంటర్మీడియెట్ మార్క్‌లిస్ట్, టీసీ, స్టడీ, పదవ తరగతి మార్కుల లిస్ట్, ఒరిజినల్ కాపీలతో రావాలని సూచించారు.

కొరత లేకుండా ఎరువులు సరఫరా చేయాలి

నంద్యాల(సెంట్రల్): జిల్లాలోని హోల్‌సేల్ ఎరువుల దుకాణాదారులు రిటైల్ డీలర్లకు, రైతులకు ఎరువుల కొరత లేకుండా సక్రమంగా సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.మురళీకృష్ణ ఆదేశించారు. గురువారం ఆయన సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్, నంద్యాల మండల ఏఓ ప్రసాదరావుతో కలిసి పట్టణంలోని హోల్‌సేల్ ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెంకట శివసాయి ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువుల నిల్వలు, స్టాక్ బుక్ రిజిస్టర్స్, బిల్ పుస్తకాలు, ఇతర ధ్రువపత్రాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ...ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయించరాదని, రైతులకు కావాల్సిన ఉత్పత్తులను మాత్రమే అమ్మాలని సూచించారు. రిజిస్టర్, గ్రౌండ్ బ్యాలెన్స్ సమానంగా ఉండేటట్లు చూసుకోవాలని చెప్పారు.



వెంకటశివ సాయి ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న డీఏవో మురళీకృష్ణ బృందం

బండలాగుడు విజేత గుడిపాడు ఎద్దులు

చాగలమర్రి: స్థానిక చెరువ కట్టపై వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా గురువారం నిర్వహించిన సేద్యపు ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీల్లో వైఎస్సార్ జిల్లా, దువ్వూరు మండలం, గుడిపాడు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.40వేల నగదు బహుమతిని గెలుపొందాయి. పోటీల్లో మొత్తం 16 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఆ తరువాతి స్థానాల్లో నిలిచిన ఎద్దులను దర్గా కమిటీ సభ్యులు ప్రకటించారు. వరుసగా..ప్రొద్దుటూరు, చెన్నూరు మండలం ఓబులంపల్లి, ప్రొద్దుటూరు, యర్రగుంట్ల, పోతిరెడ్డిపల్లి, చెరువుకిందపల్లి గ్రామాలకు చెందిన ఎద్దుల యజమానులకు దాతల సహకారంతో రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, 2వేల నగదు అందజేశారు. పోటీలను తిలకించేందుకు రైతులు తరలి వచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.ఎస్.అన్సర్‌బాషా, దర్గా కమిటీ సభ్యులు ముల్లా మౌలాలి, హనీఫ్,ఖలీల్, దాతలు పాల్గొన్నారు.



రాతి దులాన్ని లాగుతున్న ఎద్దులు

ఘనంగా ఉరుసు



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

చాగలమర్రి: స్థానిక చెరువు కట్టపై వెలసిన దస్తగిరి స్వామి ఉరుసును గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామి వారికి ప్రత్యేకంగా బాసికాలు, జెండాలు, కానుకలు సమర్పించి, ప్రత్యేక ఫాతెహాలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం శెట్టివీడు, చాగలమర్రి గ్రామాలకు చెందిన దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. శుక్రవారం జియారత్ కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయి.

భక్తిశ్రద్ధలతో ఆంథోని జయంతి



పునీత్ ఆంథోనికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పునీత్ ఆంథోనిని ప్రార్థిస్తే అద్భుతాలు జరుగుతాయని కర్నూలు మేత్రాసన పీఠాధిపతి గోరంట్ల జ్వాన్నేస్ తెలిపారు. మండలంలోని చాపిరేవుల గ్రామంలో వెలసిన పునీత్ ఆంథోని పుణ్యక్షేత్రంలో గురువారం ఆంథోని జయంతి వేడుకల్లో కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ మర్రెడ్డి, గురువులు ఫాదర్ కిశోర్, ఏసుపాదం, కేథలిక్ గురువులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతగా జరుపుకోండి



రుద్రవరంలో ముస్లింలకు సూచనలు ఇస్తున్న సీఐ చంద్రబాబు

రుద్రవరం: సోమవారం జరగనున్న బక్రీద్ పండుగను మండలంలోని ముస్లింలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని శిరివెళ్ల సీఐ చంద్రబాబు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ఆయన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండుగలో భాగంగా గోవధ చేయరాదని, హిందూ ముస్లింలు సఖ్యతతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి, ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి ఉన్నారు.

20 నుంచి మాన్యం కౌలుకు వేలాలు

శిరివెళ్ల: ఈ నెల 20వ తేదీ నుంచి వివిధ ఆలయాల మాన్యం కౌలుకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు కోటపాడు గ్రూప్ ఆలయాల ఈఓ వేణునాథరెడ్డి గురువారం తెలిపారు. 20న శిరివెళ్లలోని శ్రీ ఓంకారేశ్వరస్వామి ఆలయం భూములు, 21న బోయలకుంట్లోని శ్రీ రామేశ్వరస్వామి, వీరభద్ర, శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయాల భూములు, 23న కోటపాడులోని శ్రీ వీరభద్ర, చెన్న కేశవస్వామి ఆలయాల మాన్యం కౌలు బహిరంగ వేలం పాటలను జరుగుతాయన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ. 5 వేలు డిపాజిట్లు చెల్లించాలని, ఆలయాలకు బకాయిలున్న వారు పాటలకు అనర్హులని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ప్రధానోపాధ్యాయులకు స్టూడెంట్ కిట్లను అందజేస్తున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను మండలంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైందని, 1 నుంచి 10వ తరగతి వరకు 2,077 మంది విద్యార్థులకు ఇప్పటి వరకు 16,113 పాఠ్య పుస్తకాలు, 14,444 నోట్ పుస్తకాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఇప్పటికే బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ బాట

రుద్రవరం: మండలంలో కొద్ది రోజులుగా అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని ఎల్లావత్తుల, శ్రీరంగాపురం, డీ.కొట్టాల, కోటకొండ, చిన్న కంబలూరు తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు కలిసి ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లు పైబడిన చిన్నారులను వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కార్యకర్తలు తల్లిదండ్రులకు సూచించారు. కార్యకర్తలు మనోజ,పద్మావతి,షాహిన్, రమణమ్మ, సుహాసిని, లలితమ్మ, రాణి,రాజ్యలక్ష్మి ఉన్నారు.

చాగలమర్రి: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సుశీలమ్మ తెలిపారు. స్థానిక 6,14 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గుంతపాళెం వీధిలో చిన్నారులు, సిబ్బంది రజిని, అనురాధ కలిసి గురువారం అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.



చాగలమర్రిలో అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు, సిబ్బంది